

5న పిడిఎస్ బియ్యం విక్రయానికి వేలం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

జిల్లా పరిధిలో నిత్యావసర వస్తువుల చట్టం క్రింద 6-ఎ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 3335.8286 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యంను నిబంధనల మేరకు బహిరంగ విధానంలో విక్రయించనున్నట్లు జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బియ్యం విక్రయానికి సంబంధించి 5న మధ్యాహ్నం 3.00 గంటలకు, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఛాంబర్ వద్ద, సంబంధిత అధికారుల సమక్షంలో వేలం ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. జనవరి 3న జిల్లా పౌర సరఫరా అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచిన బియ్యం నమూనాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత నిబంధనల ప్రకారం రూ.50 వేల ధరావతు సొమ్మును చెల్లించి, నిర్దిష్ట నమూనాలో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

సాంస్కృతిక వికాసానికి ప్రభుత్వం పెద్దపీట

కార్నివాల్ ప్రారంభంలో మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్నివాల్ నిర్వహించుకోవడం సంతోషదాయకమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రెండు రోజుల పాటు నగరంలో నిర్వహిస్తున్న ఆర్ఎంసి కార్నివాల్‌ను శనివారం సుబ్రహ్మణ్య మైదానంలో ఘనంగా ప్రారంభించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతుల మధ్య 'ఫుడ్, మ్యూజిక్, ఫన్' థీమ్‌తో ఏర్పాటు చేసిన మ్యూజిక్ కన్సర్ట్స్, విభిన్న రకాల ఫుడ్ స్టాళ్లు, చిన్నారులకు వినోదాన్ని పంచే ఆటలు, సెల్ఫీ బూత్‌లు సందర్శకులను విశేషంగా ఆకర్షించాయి. మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎంఎల్ఎలతో కలిసి స్టాళ్లను సందర్శించారు. సంప్రదాయ వంటకాలను రుచి చూశారు. అనంతరం సంగీత కళాకారుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీబ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణం పేరుతో ప్రారంభమైన ఈ మైదానంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఆనందదాయకమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ కార్నివాల్ నగరానికి పండుగ శోభను తీసుకువచ్చిందని అభివర్ణించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు కుటుంబ సమేతంగా ప్రజలందరూ పాల్గొని ఆనందించేలా నగరపాలక సంస్థ ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. దైనందిన జీవితంలో ప్రజలు నిత్యం ఒత్తిళ్లకు లోనవుతూ సాంస్కృతిక వికాసానికి దూరమవుతున్నారని మంత్రి తెలిపారు. ఇటువంటి తరుణంలో ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాజమహేంద్రవరానికి ఉన్న గత వైభవాన్ని పున్నప్రారంభించేందుకు ఈ కార్నివాల్ ఒక చక్కని ప్రయత్నమని అన్నారు. ఆంధ్రా రుచులతో పాటు స్థానిక కళాకారులను ప్రోత్సహించే విధంగా స్టాళ్లను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కళల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉగాది పురస్కారాల నుంచి ప్రతినెలా ఒక రాష్ట్ర పండుగను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2027 పుష్కరాల వరకు ప్రతినెలా నగరంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా రాజమహేంద్రవరానికి ఉన్న గత వైభవాన్ని నిలబెట్టుకుందామని మంత్రి పిలుపునిచ్చారు. ఆనం కళాకేంద్రంలో గతంలో నిర్వహించిన నంది నాటకోత్సవాల వంటి కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించి, కళాకారులకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో కళలు, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్నివాల్ నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు సాంస్కృతిక అనుభూతులను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని ఆనందించేలా ఈ కార్యక్రమాలు నగరానికి పండుగ శోభను తీసుకువచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, ఎఎస్‌పి డి.మురళీకృష్ణ, ఆర్ఎంసి అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, కుడిపూడి సత్తిబాబు, యానాపు యేసు, ఇతర అధికారులు మరియు పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొన్నారు.



ఎరువులు ఎక్కువగా ఉపయోగిస్తే నష్టం

ప్రజాశక్తి-రాజానగరం

ఎరువులు ఎక్కువగా ఉపయోగించడం వల్ల భూసారం తగ్గుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. మండలంలోని నందరాడ పాక్స్ సొసైటీ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నది కేవలం అపోహ అన్నారు. డ్రోన్ టెక్నాలజీని గ్రూపులుగా సమర్థవంతంగా వినియోగించుకుంటే ఎరువుల ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అనంతరం హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలను వివరాలు అడిగారు. జాతీయ గీతం పాడటంతో చిన్నారులను అభినందించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవ రావు, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, తహశీల్దార్ దేవి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మహిళల ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రజలకు డిజిటల్ సేవలు అందిస్తూ, పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. క్వారీ మార్కెట్ సెంటర్ వద్ద డిజి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్‌ను ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి శనివారం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వయం సహాయక సంఘం సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకం ఎంతో మంచి అవకాశమన్నారు. ఈ సెంటర్ ద్వారా విద్యుత్ బిల్లులు, ఆస్తి, నీటి పన్ను, రైలు, బస్సు టికెట్లు, టెలిఫోన్ బిల్లు, కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు, బీమా చెల్లింపులు, వ్యవసాయం, ఆరోగ్యం తదితర 250 రకాల సేవలు పొందవచ్చన్నారు. తొలుత జిల్లాకో మోడల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుండగా.. జిల్లాకు సంబంధించి నగరంలోని క్వారీ మార్కెట్ సెంటర్లో ప్రారంభించినట్టు తెలిపారు. త్వరలో మరో 261 సెంటర్లు నగరవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళల ఆర్థికవృద్ధి, సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రజలకు డిజిటల్ సేవలందించి తద్వారా ఆర్థికంగా స్థిరపడాలనే లక్ష్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. దీని ద్వారా ప్రతినెలా రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ ఆదాయం ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. కియోస్క్, ప్రింటర్ తదితర పరికరాల కొనుగోలుకు రూ.2.92 లక్షల రుణం ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు, సిఎంఎం రామలక్ష్మి, ఇతర సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసు, కమిషనర్ మీనా

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-గోపాలపురం

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని ఎస్‌సి కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి అన్నారు. శనివారం యుటిఎఫ్ నాయకులు కె.ప్రకాష్, పి.శ్రీనివాసమూర్తి ఆమెను స్థానిక జెడ్‌పి స్కూల్లో ఘనంగా ఆమెను సత్కరించారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ జాతి నిర్మాతలు ఉపాధ్యాయులేనని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే అతిపెద్ద బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. తన భర్త కూడా ఉపాధ్యాయుడేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎ.జాన్ బాబు, ఎలిపే వెంకటేష్, మెరపల నాగేశ్వరరావు, వివిఎస్ఆర్‌కెవి.ప్రసాద్, కాకి దుర్గయ్య, కాకి పోసియ్య, టి.శ్రీనివాసరావు, ఐ.కృష్ణయ్య, సిహెచ్.భాస్కరరావు, చమటపల్లి రాజు, జగతా శ్రీనివాస్, గుబ్బా శ్రీనివాస్, మణి తేజ, సిఆర్‌పి కొయ్య నాగరాజు పాల్గొన్నారు.



లక్ష్మిని సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి-కొవ్వూరు

మండలంలోని దొమ్మేరులో పల్లెపండుగ 2.0లో భాగంగా ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.3.40 కోట్ల నిధులు మంజూరైన తారురోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. దొమ్మేరుకు చెందిన కళ్లేపల్లి బాలాజీ గోకులం షెడ్‌ను ప్రారంభించారు. ఎఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, టిడిపి మండల అధ్యక్షుడు బేతిన నారాయణ, మురముళ్ల సత్యనారాయణ మూర్తి, కలగర రంగారావు, సొసైటీ అధ్యక్షుడు గారపాటి వెంకట కృష్ణ, మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు గారపాటి శ్రీదేవి, జెడ్‌పిటిసి సభ్యురాలు బొంత వెంకట లక్ష్మి, యలమర్తి రాంబాబు, కలగర సుబ్బారావు, గంగుమళ్ల స్వామి, ఎరుబండి వెంకట్రావు, కొక్కిరిపాటి శ్రీహరి, జొన్న బాలకృష్ణ, డిఇ నెక్కంటి శ్రీనివాస్, ఎఇ త్రిమూర్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

లైఫ్ సర్టిఫికెట్స్ ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 లోపు తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని డిటిఒ ఎన్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల కోసం డిసెంబర్ 29న జిల్లా ఖజానా కార్యాలయ ప్రాంగణంలో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జీవన్ ప్రమాణ్, ఫేస్ యాప్ లేదా ఉప ఖజానా కార్యాలయంలో సమర్పణకు అవకాశం ఉందని తెలిపారు. నిర్ణీత గడువులో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపుల్లో అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు పలు సౌకర్యవంతమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెన్షనర్లు జీవన్ ప్రమాణ్ అప్లికేషన్, జీవన్ ప్రమాణ్ ఫేస్ అప్లికేషన్‌లను మొబైల్ ఫోన్‌లో డౌన్ లోడ్ చేయడం ద్వారా లేదా సమీపంలోని మీ సేవా కేంద్రం లేదా సంబంధిత ఉప ఖజానా కార్యాలయంలో ప్రత్యక్షంగా వొచ్చి లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. బయోమెట్రిక్ (చేతి వేలిముద్రలు) సరిగా నమోదు కాకపోవడం, ఆరోగ్య సమస్యలు, మంచానికి పరిమితమైన పరిస్థితుల్లో ఉన్న పెన్షనర్లు తమ పరిస్థితిని సంబంధిత ఉప ఖజానా కార్యాలయానికి తెలియజేస్తే, ఖజానా సిబ్బంది స్వయంగా పెన్షనర్ వద్దకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్‌ను ధ్రువీకరిస్తారని ఆయన తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలలో ఇప్పటికే కొంతమంది పెన్షన్ దారులు లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించారని,వారు కూడా జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28లోగా పైన పేర్కొన్న విధంగా మరొకసారి లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో లేదా ప్రత్యక్షంగా హాజరై సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

రెడ్‌క్రాస్ సభ్యత్వ విస్తరణకు కార్యాచరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రెడ్‌క్రాస్ సభ్యత్వ విస్తరణకు కార్యాచరణ రూపొందించినట్టు డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల జాబితాను సేకరించి, ఆయా విద్యాసంస్థలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులను సభ్యులుగా నమోదు చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రతి కళాశాల, పాఠశాలలో ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించి, సభ్యత్వ నమోదుకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాకారం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించి, విద్యార్థుల్లో సేవా భావనను పెంపొందించాలన్నారు. పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం ద్వారా రెడ్ క్రాస్ సభ్యత్వం పట్ల చైతన్యం తీసుకురావాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు ఒకటి లేదా రెండు మండలాలను దత్తత తీసుకొని, ఆయా మండలాల్లోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల, పాఠశాలలో నెలకు కనీసం రెండు రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు నిర్వహించేలా చూడాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విభజన అనంతరం రెడ్ క్రాస్ ఫండ్ వినియోగం, లైఫ్ మెంబర్‌షిప్, సభ్యత్వ వివరాలపై సమగ్రంగా సమీక్షించారు. సభ్యత్వాల పెంపునకు చర్యలు తీసుకోవాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు డిఆర్‌ఒ తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ జి.తరుణ్, వైస్ ఛైర్మన్ డాక్టర్ కెవి.రమణ, కోశాధికారి డాక్టర్ జివిఎన్‌విఎబిఎస్.మహాలక్ష్మి, మేనేజింగ్ కమిటీ సభ్యులు బి.రామకృష్ణ, బి.పద్మావతి, కలెక్టర్ కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ కుమార్, డిఇఒ కార్యాలయ ఎడి వి.వెంకటరాజు, వి.రాజు పాల్గొన్నారు.



లక్ష్య సాధనకు కృషి, పట్టుదల కావాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే నిరంతరం కృషి, పట్టుదల అవసరమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యా సంస్థల ఆవరణంలో శనివారం నిర్వహించిన ఇన్‌స్పిరిట్-2025లో తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ తిరుమలరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తిరుమలరావు విద్యాసంస్థలను స్థాపించి అతి కాలంలోనే ఎంతో మంది విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు బాట వేసారని అన్నారు. ఈ విద్యా సంస్థల్లోని విద్యార్థులు క్రమ శిక్షణకు మారుపేరన్నారు. ఎంతో మంది ఇంజనీర్లను, డాక్టర్లను అందించిందని అన్నారు. ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్ఎలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ మాట్లాడార. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యా సంస్థల డైరెక్టర్ సరోజినీ దేవి, వైస్ ఛైర్‌పర్సన్ శ్రీరష్మి, అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, ప్రినిపల్ శ్రీహరి పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

అంగన్‌వాడీల్లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌లో భాగంగా కేంద్రాల్లోని చిన్నారులతో పాటు తల్లులు చేత ఆట లాడించడం వంటి కార్యాచరణ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.బాలసరస్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శారీరక, మేధాభివృద్ధి గణిత, మానసిక అభివృద్ధి గురించి పిల్లలతో చేయించే కార్యాచరణలో తల్లులు పాల్గొనేలా చేసి, పిల్లల చేత చేయించినట్టు తెలిపారు. స్పర్శ ద్వారా చిన్నారులను గుర్తించి ఆటలు ఆడించారు. దీంతోపాటు బాల్య వివాహ ముక్త భారత్‌పై తల్లిదండ్రులచే ప్రతిజ్ఞ చేయించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని బొబ్బిలంక హైస్కూల్ విద్యార్థిని సోడదాసి తేజస్విని నిరూపించింది. ఇటీవల వినియోగదారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఈమె ద్వితీయ బహుమతిని సాధించింది. డిజిటల్ విధానం ద్వారా వినియోగదారులకు సత్వర న్యాయం అనే అంశంపై తేజస్విని వ్యాసం రాసింది. విజయవాడలో నిర్వాహకులు ఆమెకు రూ. 7,500 నగదు పురస్కారం, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. శనివారం బొబ్బిల్లంక హైస్కూల్ హెచ్ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో తేజస్విని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.రామచంద్రరావు విద్యార్థినిని, ఆమెను ప్రోత్సహించి, పోటీలకు సిద్ధం చేసిన ఉపాధ్యాయిని లాల్ రేష్మను ఘనంగా సత్కరించారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యాభివృద్ధికి సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమనిరాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. శనివారం వేలివెన్నులోని ఆయన స్వగృహంలో యుటిఎఫ్ నూతన డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, అధ్యక్షుడు కె.శ్రీనివాసు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వి.సూర్యభాస్కర్ రెడ్డి, ఎల్.అమ్మిరాజు, జెడ్‌పిహెచ్ఎస్ వేలివెన్ను యుటిఎఫ్ అధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు, పాఠశాలల హెచ్ఎం ఎం.తిరుపతిరావు, ఇ.వెంకటేశ్వర్లు, పి.శివప్రసాదరావు, పిఇటి పి.వీరన్న బాబు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ యూరియా అందజేస్తాం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో శనివారం రైతులకు యూరియా అందించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పివి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ పంటలు 2,367 హెక్టార్లు, ఉద్యాన పంటలు 542 హెక్టార్లు మొత్తం కలిపి 2,909 హెక్టార్లు విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని తెలిపారు. దీనికి గాను 1160 టన్నుల యూరియా అవసరమవుతుందని, ఇప్పటివరకు మండలానికి సంబంధించి 370 టన్నుల యూరియా రైతులకు సరఫరా చేశామని, రాబోయే రెండు రోజుల్లో 130 మెట్రిక్ టన్నులు, జనవరి 2, 3 తేదీలలో మరో 125 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవా సంద్రాలకు, సొసైటీలకు సరఫరా చేస్తామని తెలిపారు.

కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యవర్గం

ప్రజాశక్తి-నిడదవోలు


కేబుల్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకునా్రఉ. అధ్యక్షునిగా మారిశెట్టి అమ్మిరాజు (డి.ముప్పవరం) ఉపాధ్యక్షునిగా నిట్ల సూరిబాబు (పల్లంట్ల) కార్యదర్శిగా వెలగన సూర్యచంద్రరావు (గోపవరం) కోశాధికారిగా కొత్త శ్రీధర్ (మల్లవరం) ఉప కార్యదర్శిగా బండారు సతీష్ (కాటకోటేశ్వరం), కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో మీరు అప్పజెప్పిన బాధ్యతలను అందరి ఆమోదంతో యూనియన్ అభివృద్ధికి, సభ్యుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

నాలుగో ఫేజ్ రీసర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ నాలుగవ విడత రీ సర్వే చేపట్టామని తహశీల్దారు లక్ష్మీ లావణ్య తెలిపారు. దీనిలో భాగంగా శనివారం మలకపల్లి గ్రామంలో సర్వేకు శ్రీకారం చుట్టగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ రాపాక రాజేశ్వరి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో ఆర్ఐ సాహిత్య, సీనియర్ అసిస్టెంట్ కైగాల రామకృష్ణ, సర్వేయర్ నాగేంద్ర పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పాట్ హోల్ ఫ్రీ సిటీగా రాజమహేంద్రవరం

పాట్ హోల్ ఫ్రీ సిటీగా నగరాన్ని తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనికి సబంధించిన పనులు ఇప్పటికే ప్రారంభమైయ్యాయన్నారు. స్థానిక ఎవి.అప్పారావు రోడ్డులో శనివారం గుంతలు పూడ్చే పనులను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో సుమారు 507 పాట్ హోల్స్‌ను దాదాపుగా పూడుస్తారని తెలిపారు. గతంలో కురిసిన అకాల వర్షాలు, తుపానుల కారణంగా ఈ పనుల్లో జాప్యం ఏర్పడిందన్నారు. మూడు ఫేజుల్లో నగరంలో ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చేందుకు శ్రీకారం చుట్టామన్నారు. శ్యామలానగర్‌లోని రామాలయం జంక్షన్ నుంచి ఏవి అప్పారావు రోడ్డు, నందం గన్నిరాజు జంక్షన్ నుంచి టిటిడి కళ్యాణ మండపం రోడ్డు,చర్చిపేట ఆర్‌ఓబీ నుంచి రంభ, ఊర్వశి, మేనక థియేటర్ డౌన్ క్వారీ సెంటర్ నుండి లాలా చెరువు జంక్షన్ వరకు ఉన్న రోడ్లతో పాటు అనేక ప్రాంతాల్లో గుంతలు పూడ్చడం జరుగుతుందన్నారు. ఫోర్త్ ఫేజ్‌లో చేపట్టాల్సిన పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మజ్జి రాంబాబు,వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు,ఉప్పులూరి జానకి రామయ్య, సలాది ఆనంద్, దాస్యం ప్రసాద్,చొప్పెర్ల భద్రరావు, ముసిని బాబురావు, యాళ్ల శ్రీను, చాపల చిన్నరాజు పాల్గొన్నారు. నగర పర్యటనలో భాగంగా శనివారం 49వ వార్డులో పర్యటించిన ఎంఎల్ఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్వారీ సెంటర్‌ను తీర్చిదిద్దుతామన్నారు. గత వైసిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు రంగులు చేసి ప్రచారం చేసుకుంది తప్ప కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలకు రూ.2 కోట్ల 20 లక్షలు ఖర్చు చేస్తామన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు

ఈ నెల 31న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పెరవలి

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పింఛనుదారులందరికీ ఈ నెల 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపిడిఒ కెయుఆర్ఎల్.పద్మజ తెలిపారు. జనవరి నెల ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ కార్యక్రమం ఒకరోజు ముందుగా డిసెంబర్ 31న ఉదయం 6:30 గంటల నుంచి పంపిణీ చేస్తారని, కావున పింఛన్ లబ్ధిదారులందరూ గమనించి అందుబాటులో ఉండాలని సూచించారు.

29 నుంచి రెవెన్యూ క్లినిక్‌లు

ప్రజాశక్తి-నల్లజర్ల

రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జిల్లా కలెక్టర్ సంయుక్త ఆదేశాల ప్రకారం మండలంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ఈనెల 29 నుంచి ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్ పేరిట గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని తహశీల్దారు పి.కృష్ణారావు తెలిపారు. మండలంలోని భూ సమస్యలు ఉన్న ప్రతి రైతూ ఇతర పౌరులు రెవెన్యూ క్లినిక్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా అమర్జహ

ప్రజాశక్తి-కొవ్వూరు

కాంగ్రెస్ పార్టీ ఎపి మహిళా అధ్యక్షురాలుగా కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి చెందిన అమర్జహే బేగ్ శనివారం న్యూఢిల్లీలో నియామక ఉత్తర్వులు అందుకున్నారు. మహిళా కాంగ్రెస్ ఆలిండియా అధ్యక్షురాలు అల్కాలాంబ నుంచి ఆమె ఈ నియామక ఉత్తర్వులు అందుకున్నామన్నారు. ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీకి అమర్జహే బేగ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి చదువుపై మక్కువతో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ పురస్కారాలు అందుకునే స్థాయికి ఎదగాలని ప్రముఖ కవి, సంఘ సేవకుడు డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్ అన్నారు. గత 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మండలంలోని పైడిమెట్ట గ్రామంలో ఎపిఫానియా లూథరన్ దేవాలయంలోని క్రిస్మస్ వేడుకల్లో ప్రమోద్ కుమార్ ప్రతిభ పురస్కారాలు అందజేశారు. జొన్నకూటి వెంకయ్య మంగమ్మ మెమోరియల్ అవార్డు పేరుతో 2011 నుంచి ప్రతి సంవత్సరం విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ డి.సుధీర్ బాబు, రెవరెండ్ జెవి అరుణకుమార్, మాజీ ఎంపిపి కొప్పాక కోటేన్స్, దున్నా దుర్గారావు, మాస్టర్ పిసిసి పుష్పరాజు, గెడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

200 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి-గోకవరం

కామరాజుపేట, కొత్తపల్లి గ్రామాల్లో కోడి కత్తులు తయారు చేస్తున్న వారిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి 200 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన చేదులూరి వీరబాబు, సూరంపూడి కోటేశ్వరరావు, కామరాజుపేటకు చెందిన వేములూరి నాగేశ్వరరావును అదుపులోనికి తీసుకున్నట్లు సిఐ ఎస్‌విపిఎస్.మూర్తి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు విఎన్‌వి.పవన్ కుమార్, బి.నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

6 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-గోకవరం

ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సారా అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని, అతని వద్ద నుండి 6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. అతడిని రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి ప్రవాహానికి విరిగిన తలుపు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ప్రధాన పంట కాలువ నుంచి ప్రవహించే నీటి ఉధృతికి శనివారం కపిలేశ్వరపురం వద్ద కొండయ్య సర్పస్ నుంచి నీటిని విడుదల చేసే 4 తలుపుల్లో ఒకటి విరిగిపోయింది. ప్రధాన కాలువ నుంచి ప్రవహించే నీటిని ఉధృతిని బట్టి కపిలేశ్వరపురం వద్ద కొండయ్య డ్రెయిన్‌కు నీటిని విడుదల చేస్తారు. అయితే కంట్రోలింగ్ సిస్టం ద్వారా నీటిని విడుదల చేసే 4 తలుపులకుగాను ఒకటి పాడే విరిగిపోవడంతో నీటి ప్రవాహ ఉధృతికి మిగిలిన మూడు తలుపులను పైకి లేపి నీటిని విడుదల చేశారు. ప్రధాన పంట కాలువ ప్రవాహాన్ని కట్టడి చేశారు. అనంతరం లీకేజీని అరికట్టేందుకు ఇరిగేషన్ అధికారులు తార్పాలిన్ ఏర్పాటు చేసి సర్వేబాదులు, ఇసక బస్తాలతో ఆ ప్రాంతాన్ని పూడ్చి తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఈ సమస్యల కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు గోదావరి ఈస్ట్రన్ డివిజనల్ ఇఇ, ఇరిగేషన్ కోటిపల్లి డిఇ వివి.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ రామకష్ణ, ఎల్ఎస్ఎం.సత్యవతి, ఎఇఇ కృష్ణత్రిమూర్తులు, సిబ్బంది, పాల్గొన్నారు.



రాముకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఎల్ఎ ఆనందరావు

ఘనంగా సర్పంచ్ రాము పుట్టినరోజు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

గున్నేపల్లి అగ్రహారం గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు(రాము) పుట్టినరోజు వేడుక శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన సమక్షంలో కేక్ కట్ చేసి రాముకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మాచవరం సర్పంచ్ నాగబత్తుల శాంత కుమారి, నల్ల చిట్టిబాబు, ములపర్తి సత్యనారాయణ, పలివెల శ్రీను, పెద్దిరెడ్డి శ్రీరామ్‌మూర్తి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నాగభూషణం, సీతా రామయ్, చొల్లంగి శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి రామకృష్ణ, నాగబత్తుల ఏడుకొండలు, పెద్దిరెడ్డి సూర్యచంద్రరావు, పెద్దిరెడ్డి దుర్గాప్రసాద్, ఆకుల సత్తిబాబు, అభిమానులు రాముకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

వెదిరేశ్వరంలో నెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - రావులపాలెం

. వెదిరేశ్వరంలో మాజీ వైస్ ఎంపిపి దండు సుబ్రహ్మణ్యేశ్వర వర్మ శనివారం దండు సాయి ఆకాష్ వర్మ మెమోరబుల్ టోర్నమెంట్ 10వ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నెట్ బాల్‌లో ప్రతిభ కనబరిచి దండు సాయి ఆకాష్ వర్మ అకాల మరణానికి గురయ్యారన్నారు. సాయి ఆసక్తి మేరకు ఆయన తండ్రి దండు సుబ్రహ్మణ్యేశ్వరవర్మ ఈ పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం జగ్గిరెడ్డి టాస్ వేసి ఈస్ట్ గోదావరి వర్సెస్ నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాల నుండి విచ్చేసిన క్రీడాకారులను ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపిడిఓ అబ్బాస్

గ్రామాల్లో యునైటెడ్ ఫ్యామిలీ సర్వే

ప్రజాశక్తి - అంబాజీపేట

ఇరుసుమండ, మొసలపల్లి గ్రామాలలో జరుగుతున్న యునైటెడ్ ఫ్యామిలీ సర్వేను శనివారం డిప్యూటీ సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఓ ఎండి.అబ్బాస్ అలీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి కుటుంబం యొక్క నాలుగు అంశాలపై వివరాలు నమోదు చేస్తున్నారన్నారు. ప్రాథమిక, సామాజిక, ఆర్థిక, పురోగతి వివరాలను సర్వే యాప్ లో నమోదు చేసి భవిష్యత్తు పథకాలకు ఈ సమాచారం అందజేయనున్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు జారీ సులభతరం, పారదర్శకత పాలన, అందుబాటు ప్రోయాక్టివ్ సర్వీస్, డేటా భద్రత ఉంటుందన్నారు. సిబ్బంది వచ్చినప్పుడు ఆధార్ కార్డు, ఒటిపి కోసం మొబైల్ ఫోన్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రజల జీవన ప్రమానాల మెరుగుదలకు ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో సర్వే చేస్తున్నట్లు వివరించారు. ఈ సర్వేను నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామాల సచివాలయాల విజిట్ చేశామన్నారురు. ఈ సర్వేలో సర్వర్ ఇబ్బందులు తదితర అంశాలపై పర్యవేక్షిస్తున్నామన్నారు.

కూటమి పార్టీలకు కేంద్రం చురక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి పార్టీలకు కేంద్రం చురకలు వేసిందా అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. బిజెపి సర్కారు ఉపాధి చట్టాన్ని తాజాగా రద్దు చేసిన విషయం విదితమే. ఈ స్థానంలో బివిరామ్‌జీ పథకాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో మెటీరియల్ కాంపోనెంట్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక శాతం అప్పజెప్పింది. రాష్ట్ర విభజన, అనంతరం జిల్లాల పునర్విభజనల నేపథ్యంలో అభివృద్ధి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కల్పించలేని దుస్థితిలో పాలన సాగుతోంది. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గడిచిన 18 నెలలో సాధించిన అభివృద్ధి మేడిపండు చందంగా మారింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలు ఉపాధి పథకంలోనే జరుగుతున్నాయి. కేంద్రం నిర్ణయంతో ప్రస్తుతం ఈ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. మరోవైపు కరోనా నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్ కాలంలో ఉపాధి పనులే గ్రామీణులకు ఆసరాగా నిలిచాయి. ఇప్పటికీ పల్లెల్లో ఉపాధి పనులు అత్యధిక మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రజల ఉపాధి కల్పనకు, అభివృద్ధి పనులకు శరాఘాతంగా మారినా ప్రశ్నించలేదని దుస్థితిలో టిడిపి, జనసేన పార్టీల నేతలు ఉన్నారనేది మరో సారి సుస్పష్టమైతంది. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకుని రాష్ట్ర ప్రయోజనాలకోసం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

కార్మికుల పండుగకు సమాయత్తం

విశాఖపట్నంలో జరగబోయే సిఐటియు అఖిలభారత మహాసభలకు ఉమ్మడి జిల్లాల నుంచి తరలి వెళ్లేందుకు కార్మికులు సమాయత్తం అవుతున్నారు. జిల్లాలో అత్యధిక మంది వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటు పట్టణాలలో వివిధ వాణిజ్య, వ్యాపార రంగాలలో ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి పనిగంటలలో మార్పులు తీసుకొచ్చింది. మరో వైపు స్కీము వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఇప్పటికే ఆందోళన బాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలే దిక్యూచి అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో విశాఖలో జరిగే మహాసభ భవిష్యత్తు పోరాటాలకు దశ, దిశ నిర్దేశం చేస్తుందని సుస్పష్టం అవుతోంది. దీంతో వేలాదిగా తరలి వెళ్లి పాలక ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిద్ధమవుతున్నారు.

అబ్బుర పర్చిన సైన్స్ సంబరాలు

చిన్నారులలో సృజనాత్మకత వెలికితీసేందుకు నిర్వహించిన ఆవిష్కరణలు అబ్బుర పరిచాయి. జనవిజ్ఞాన వేదిక ఆద్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడ వేదికైంది. సత్యసాయి గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు రాజమహేం ద్రవరంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. వైజ్ఞానిక



ప్రదర్శనలతో పాటు ఇతర వ్యాస రచన, ఆర్ట్ కాంపిటిషన్‌లలోనూ ఆసక్తి చూపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి నిర్వహకులు వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభావేదికపై వ్యక్తల ప్రసంగాలు విద్యార్థులను ఆలోచింపచేశాయి. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండటంతో పాటు శాస్త్రీత ఆలోచనలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలనే ఆకాంక్షించారు

ఎట్టకేలకు టిడిపి అధ్యక్షుల ఎంపిక

టిడిపి జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఎట్టకేలకు ముగిసిన విషయం విదితమే. తాజా నిర్ణయంతో అశావహుల్లో కొంత నిరాశ వ్యక్తమైంది. పార్టీ కార్యాలయాలను నెలకొల్పేందుకు కృషి జరగాలని మంత్రి నారా లోకేష్ సూచించారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న ప్పటికీ టిడిపికి సొంత కార్యాలయాలు లేవు. ప్రజాప్రతినిధుల కార్యాయాలే పార్టీ కార్యాలయాలుగా ఉన్నాయి. తాజా నిర్ణయంతో స్థలాల ఎంపిక జరగనుందని సుస్పష్టం. గత ప్రభుత్వ హయాంలో వైసిపి ప్రభుత్వ స్థలాల్లో పార్టీ కార్యాలయాలు నెలకొల్పేందుకు చేసిన ప్రయత్నం విమ ర్శలకు దారి తీసిన విషయ విదితమే. ఈ అనుభవంతో టిడిపి ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.



ఎంఎల్ఎ వేగుళ్లను సత్కరించి పుష్పగుచ్ఛం అందిస్తున్న మీనా

ఎంఎల్ఎ వేగుళ్లను కలిసిన మీనా

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం, మండపేట

టిడిపి అమలాపురం పార్లమెంట్ మెయిన్ కమిటీ కార్యదర్శిగా నియమితులైన పిల్లి మీనా శనివారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో పార్లమెంట్ కమిటీ లో కార్యదర్శిగా నియమించినందుకు ఎంఎల్ఎ వేగుళ్లను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండపేట మండల మాజీ అధ్యక్షులు యరగతపు బాబ్జి, ద్వారపూడి గ్రామశాఖ అధ్యక్షులు సత్తి సత్యనారాయణ, జెడ్.మేడపాడు సొసైటి ఛైర్మన్ సలాది బాలసుబ్రహ్మణ్యం, చింతా దొరబాబు, వర్రె వీరబాబు, కొవ్వల రాజు, దాట్ల కృష్ణంరాజు, సత్తింశెట్టి అయ్యప్ప పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో ఇటీవల పలువురు మరణించారు. వారి కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఈ పరామర్శల్లో నూని వీర్రాజు, రిమ్మలపూడి రామక ష?, వానపల్లి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, చంద్రు రాజు, దేవు శ్రీను ఉన్నారు.

విద్యార్థులకు డిఇఒ అభినందన

ప్రజాశక్తి - అమలాపురం

విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శనలో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఫుట్ ప్రెస్ పవర్ జనరేటర్ రాష్ట్ర స్థాయిలో ఎంపికైందని హెచ్ఎం కె.ఘన సత్యనారాయణ తెలిపారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిఇఒ పి.నాగేశ్వరరావు విద్యార్థులు ఎన్.సత్య ప్రవీణ్, పి.సిద్దార్థలకు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో శనివారం హెచ్ఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను, గైడ్ టీచర్స్ పివిఎల్ఎన్.శ్రీరామ్, ఎంఎస్‌డి భవాని, ఉపాధ్యాయులు బి ఎన్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ప్రసాద్, వర్మ, శ్రీనివాస్, గోపాలకృష్ణ, సత్యనారాయణ, చంద్రమోహన్. కర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గున్నారు.

దాతల సహకారంతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రహదారి లేక ఇబ్బందులు పడుతున్న గ్రామానికి దాతల ఆర్థిక సాయంతో రహదారి నిర్మించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక 12 వార్డు ప్రాంతమైన మల్లయ్య పాలెం గ్రామానికి వెళ్ళేందుకు సరైన రహదారి లేక పైకోడు మెరక, ఉందుర్తి వారి పేటకు రాకపోకలు సాగించాలంటే అష్టకష్టాలు పడుతున్న సమస్యను గ్రామస్తులు బంకు రాము, రెడ్డి అబ్బులు దృష్టికి తీసుకువచ్చారు. వీరిద్దరూ స్పందించి రహదారి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేశారు. దీనితో హుటాహుటిన గ్రావెల్ రోడ్డును నిర్మించారు. ప్రజల అవసరాన్ని గుర్తించి రాకపోకలు సాగించెందుకు సహకరించిన దాతలకు శనివారం గ్రామానికి చెందిన యల్లమిల్లి వెంక టేశ్వరావు, గెద్దం శ్రీనివాసరావు, దొంగ గంగాధర్, జంగా మణికంం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

వాడపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి 2026 వార్షిక క్యాలెండర్‌ను ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు శనివారం ఆవిష్కరించారు. సోమవారం జరగనున్న ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకార ఏర్పాట్లను ఎంఎల్ఎ పరిశీలించారు. అనంతరం స్వామివారిని దర్శించుకునిపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొనడం సంతోషదాయకమని ఎంఎల్ఎ అన్నారు. .

కలెక్టరేట్‌లో 'క్రిస్మస్ ఈవ్ హైటి'

ప్రజాశక్తి అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఈవ్ హైటి ప్రోగ్రామ్‌ను శనివారం క్రైస్తవ మత పెద్దలతో జిల్లా యంత్రాంగం నిర్వహించింది. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా అందరికీ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆనందరావు, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సునీల్ వికాస జిల్లా మేనేజర్ రమేష్ మత పెద్దలు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

దాతల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - కాట్రేనికోన

కార్తీకమాసంలో యాత్రికుల అన్నదానం కోసం సహకరించిన దాతల సేవలు మరువ లేనివని ఎంపీ గంటి హరీష్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. శనివారం కార్తీకమాసంలో సహకరించిన దాతలకు మండల పరిధిలోని కొండలేశ్వరం శివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ హరీష్, ఎంఎల్ఎ సుబ్బరాజు పాల్గొని దాతలు అందర్నీ దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, పిఎస్ఎన్.రాజు, గంగుమళ్ల భద్రరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జిగా డాన్ సూరి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎమ్ఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జిగా డాన్ సూరి నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. సూరికి ఎమ్ఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఇఎఫ్ అనుబంధ సంఘాలనాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

11 నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వచ్చే నెల 11, 12, 13వ తేదీల్లో నిర్వహించే సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆత్రేయపురంలో ముదునూరి వెంకటరాజు స్వగృహంలో శనివారం జరిగిన టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఆత్రేయపురం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. బొబ్బర్లంక - వద్దపర్రు రహదారి పనులు త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని టెంపుల్ టూరిజంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. వచ్చే నెలలో డ్రాగన్ పడవ పోటీలు, ఈత పోటీలు, లొల్ల లాకుల వద్ద ఫుడ్‌ఫెస్టివల్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. లొల్ల లాకుల పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రహదారులు డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ ఐక్యమత్యంతో కల్సి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాథం, ముళ్ళపూడి భాస్కరరావు,నాగిరెడ్డి సత్యనారాయణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సర్పంచ్ బాలరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - అంబాజీపేట

ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఆధ్వర్యంలో శనివారం పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లియ్య సర్పంచ్‌కు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉప సర్పంచ్ వీరా రవి, మాజీ ఎంపిటిసి సభ్యుడు నూకపెయ్యి సత్యనారాయణ, వర్మ, గంటి చిరంజీవి, బొట్టు బంగారం కార్యక్రమంలో పాల్గొని సర్పంచ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నిత్యాన్నదానానికి రూ.1 లక్ష విరాళం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి విశాఖపట్నానికి చెందిన కవికొండల వెంకట్రావు పేరుమీద ఆయన సతీమణి కవికొండల అప్పలనర్సమ్మ రూ. 1 లక్ష ఆలయ సహాయ కమిషనర్, ఇఒ అల్లు వెంకట దుర్గా భవానీకి విరాళంగా అందజేశారు. దాతకు భీమేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

అప్పనపల్లిలో రూ.10 వేల విరాళం

మామిడికుదురు: రాజమండ్రికి చెందిన మల్లిన ఆకాష్‌చౌదరి, వికాస్ చౌదరి, వారి కుటుంబ సభ్యులు అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని శనివారం దర్శించి, స్వామివారి అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.10,116 విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి, శ్రీ స్వామివారి చిత్రపటం అందజేశారు.

పాఠశాల అభివృద్ధికి హామీ

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

కలవచర్లలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మీటింగ్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేడవరపు భద్రం దొరను శనివారం ఉపాధ్యాయులు ఆహ్వానించారు. సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు. భద్రం దొర మాట్లాడుతూ స్కూల్‌కి ఘన చరిత్ర ఉందని తెలిపారు. స్కూల్‌కు ప్రింటర్ సమకూరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిద్దె మీనాక్షి దంపతులు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాట్రేనికోన

షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకిల్లు దగ్ధమైంది. కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని సత్తెమ్మ చెట్టు గ్రామంలో శనివారం సాయంత్రం జగడంనాని బాబుకు చెందిన తాటాకిల్లు షార్ట్సర్క్యూట్ కారణంగా మంటల్లో కాలిపోయింది. దీంతో హుటాహుటీన సంఘటనా స్థలానికి ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షలు విలువ చేసే గృహ ఉపకరణాలు కాలి బూడిదయ్యాయి.

వాడపల్లిలో కారు బీభత్సం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి పార్కింగ్ ప్రదేశంలో శనివారం కారు బీభత్సం సృష్టించింది. దీంతో మూడు కారులు పాక్షింగా దెబ్బతిన్నాయి. వివరాలు ఇవి.. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచి తన కారును యజమాని న్యూ పార్కింగ్లో పెట్టారు. కారు మొరాయించడంతో మెకానిక్ రిపేర్ చేసేందుకు వచ్చాడు. ఈ తరుణంలో కారు యజమాని కారును స్టార్ట్ చేసి ఇంజన్ చెక్ చేస్తున్నాడు. ఈ సమయంలో ఒక్కసారిగా కారు ముందుకు దూసుకుపోవడంతో మూడు కార్లు దెబ్బ తిన్నాయి. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో నాలుగు కార్లకు నష్టం వాటిల్లింది.

29న 'ఉపాధి'పై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఉపాధి హామీ చట్టంలో 24-25లో జరిగిన పనులకు సంబంధించి ఈనెల 29వ తేదీ నుంచి జరిగే సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. దీనిపై శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బికెఎస్-ఎస్. వెంకటరామన్ అధ్యక్షతన సామాజిక తనిఖీ బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం అదనపు కార్యక్రమ అధికారి సిహెచ్.విజయరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కాకినాడలో విలీనం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గం కాకినాడ జిల్లాలో కొనసాగించాలని అఖిలపక్ష ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్‌డిఒ, ఇతర డివిజన్ కార్యాలయాలు రామచంద్రపురం అనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అఖిల పక్ష జెఎసి కన్వీనర్ మాగాపు అమ్మి రాజు, కో- కన్వీనర్, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, జిల్లా ఎఐకెఎంఎస్ నాయకులు వెంటపల్లి భీమశంకరం, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, బిఎస్‌పి కాకినాడ జిల్లా అధ్యక్షులు మాతా సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కలపడం పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్యగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష జెఎసి గౌరవ అధ్యక్షులు దొమ్మలపాటి సత్యనారాయణ, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి, పివైఎల్ నాయకులు నాగరాజు, రైతు కూలీ సంఘం నాయకులు చెల్లె లక్ష్మి, మల్లిడి జార్జి, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఆలమూరు

ఖమ్మంలో జనవరి 18 న 5 లక్షల మందితో సిపిఐ శత వసంతాల వార్సికోత్సవ ముగింపు సభ ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆలమూరు బస్టాండ్ లో గల అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ మండల కార్యదర్శి యేసురాజు చేతుల మీదుగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌టియు కార్యాలయం వద్దకు చేరుకొని బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సిపిఐ కొత్తపేట నియోజకవర్గం కార్యదర్శి కె.రామకృష్ణ వందన సమర్పణ చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరు ఆర్‌సిఎం చర్చిలో శనివారం పాస్టర్ పినిపే జయరాజ్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయెల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్న వరాజు తదితరులు పాల్గొని క్రిస్మస్ కేకును కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లు యర్రంశెట్టి రామచంద్ర రావు, గెద్దం స్వరూప రాణి, మాజీ సర్పంచ్ గెద్దం సురేష్ బాబు, వైసిపి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు, నాయకులు మోటూరి సత్యం కాపు,యనమదల పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - కాట్రేనికోన.

చెయ్యేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ప్రపంచ వికలాంగ దినోత్సవ సంబరాలు ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో వికలాంగులు రాణిస్తున్న తరుణంలో ప్రభుత్వం వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ వికలాంగులకు అన్నివిధాల అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో భవిత పిల్లలకు అవసరమైన సామగ్రిని టిడిపి రాష్ట్ర నాయకులు నడింపల్లి సుబ్బరాజు ఆధ్వర్యంలో దాతలు ఔదార్యంతో నిధులు సమకూర్చారు. కార్యక్రమంలో ఎస్‌సి మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, నాగిడి నాగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, చెల్లి సురేష్, నడింపల్లి సుబ్బరాజు, దాట్ల పవన్, పిఎస్ఎన్ రాజు, త్సవటపల్లి నాగు, త్సవటపల్లి శ్రీనివాస్, తెలుగు యువత మండల అధ్యక్షులు వంగ దుర్గబాబు ఉన్నారు.

2 నుంచి క్షేత్రస్థాయి రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో భూముల రీ-సర్వే ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తహశీల్దారు అంకం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుంచి ములకల్లంక, రఘుదేవపురం గ్రామాల్లో ఈ సర్వే పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆయా గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహించనున్నారు. ములకల్లంకలో డిసెంబర్ 29న ఉదయం 10 గంటలకు, రఘుదేవపురంలో డిసెంబర్ 30న గ్రామ సభలు నిర్వహిస్తామని తహశీల్దారు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులందరూ తమ వద్ద ఉన్న భూమికి సంబంధించిన ఒరిజినల్ రికార్డులు, ధ్రువపత్రాలతో ఈ గ్రామ సభలకు హాజరుకావాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.